

దొడ్డిదారిన ఎన్నికలు వైసిపికి వెన్నతో పెట్టిన విద్య

రాయచోటి: ఎన్నికల్లో దొడ్డిదారిన లబ్ధిపొందడం అధికార పార్టీకి వెన్నతో పెట్టిన విద్య అని, నామినేషన్ పత్రాలను చించివేయడం, పోటీలో ఉన్న ప్రత్యర్థులను భయభ్రాంతులను చేసి గద్దెనెక్కడం ఆ పార్టీకి అలవాటేనని టిడిపి నియోజకవర్గ నాయకులు మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండిపల్లి భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ పట్టభద్రుల, ఉపాధ్యాయ మండలి అభ్యర్థుల ఎన్నికల సరళి రాజ్యాంగాన్ని, భారత ఎన్నికల కమిషన్ విధానాన్ని ఆపహాస్యం చేసేవిధంగా అధికార పార్టీ తీరు ఉందని తెలిపారు. అధికారపార్టీ అడుగులకు మడుగులొత్తే విధంగా ఎన్నికల సిబ్బంది ప్రవర్తించడం భారతదేశ ప్రజలను వ్యవస్థలపై ఉన్న నమ్మకాన్ని వమ్ముచేయడమేనని వాపోయారు. ఎన్నికల సమయంలో అధికారపార్టీ నాయకులు విచ్చలవిడిగా డబ్బులను పంచుతూ, మద్యాన్ని సరఫరా చేస్తూ మీడియా కెమెరాలకు అడ్డంగా దొరికినా పోలీసులు, అధికారులు పట్టుపట్టనట్లు ఉండడం దేనికి సంకేతమనీ ప్రశ్నించారు. కనీసం 7, 8, 9, 10వ తరగతి చదవని వారితో పట్టభద్రుల ఓట్లను వేయించడం, ఎన్నికలకు ఎటువంటి సంబంధంలేని అధికారపార్టీ గూండాలను ఎన్నికల బూత్‌లలో ఓటర్లను ప్రలోభపెడుతుంటే పోలీసులు ప్రేక్షకపాత్ర వహించడం శోచనీయమని వాపోయారు.

బిసిల అభ్యున్నతి టిడిపితోనే సాధ్యం

- బిసిల సదస్సులో నారా లోకేష్



సదస్సులో మాట్లాడుతున్న నారా లోకేష్

ప్రజాశక్తి-బి.కొత్తకోట

బిసిల రక్షణ కోసం ప్రత్యేకంగా బిసి రక్షణ చట్టం తీసుకొస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ అన్నారు. యువగళం పేరుతో లోకేష్ చేపట్టిన పాదయాత్ర 42వ రోజుకు చేరుకుంది. మంగళవారం అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె నియోజకవర్గం కురబలకోటలోని కంటేవారిపల్లె నుంచి ప్రారంభమైన పాదయాత్ర బి.కొత్తకోట మండలంలోని కండ్లమడుగు క్రాస్, హార్సిలీహిల్స్ క్రాస్, మద్దయ్యప్పగారిపల్లె, మొగసాలమర్రి, కుమ్మరపల్లి, నాయనిబావి పంచాయతీ పరిధిలోని గుట్టపాలెం విడిది కేంద్రం వరకు పాదయాత్ర సాగుతుంది. ఆయా ప్రాంతాల్లో స్థానికులు, బిసి సామాజిక వర్గీయులు, మహిళలు, డెయిరీ రైతులతో మాటామంతి, ముఖాముఖి వంటి కార్యక్రమాలు నిర్వహించారు. పెద్దమద్యం మండలంలోని ప్రజలతో మద్దయ్యప్పగారిపల్లె వద్ద భేటీ అయ్యారు. పాదయాత్ర సందర్భంగా పలు చోట్ల లోకేష్ మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా ఉన్న కాలంలో బిసిలను అన్ని విధాల ఆదుకున్నామన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అధికారం చేపట్టాక సామాజిక న్యాయం పేరుతో బిసిలపై దాడులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 2 వేల మందికిపైన, రాష్ట్రవ్యాప్తంగా 30 వేల మంది బిసిలపై అక్రమ కేసులు బనాయించిందని తెలిపారు. వారి తరఫున తాను పోరాటం చేస్తున్నానన్నారు. 57 కార్పొరేషన్లు ఏర్పాటు చేశామని గొప్పలు చెప్పుకుంటున్నా, వాటికి ఇంత వరకు నిధులు కేటాయించడం పాపాన పోలేదన్నారు. అమరావతిలో కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లకు కూర్చోవడానికి కనీసం కుర్చీలు కూడా లేవని ఎద్దేవా చేశాడు. తాము అధికారంలోకి రాగానే బిసిలపైన పెట్టిన కేసులను ఎత్తివేస్తామని, అక్రమ కేసులు బనాయించిన అధికారులపై జ్యుడీషియల్ ఎంక్వయిరీ వేసి శిక్షపడేలా చూస్తామన్నారు. యాదవ, కురువ, కుమ్మర, పద్మశాలి, విశ్వబ్రాహ్మణ, వడ్డెర, పద్మశాలి, రజకులు, వాల్మీకుల, పాల ఏకిర్లకు ఇతర బిసి ఉపకులాలకు ప్రత్యేకంగా ఫెడరేషన్లను ఏర్పాటు చేసి దామాషా ప్రకారం నిధులు కేటాయిస్తామన్నారు. వైసిపి ప్రభుత్వం బిసి విద్యార్థుల ఉన్నత చదువుల కోసం ఏర్పాటు చేసిన అన్ని పథకాలు రద్దు చేసి తీరని ద్రోహం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు జగన్ బిసిలకు కొండంత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చాకా చెవిలో పువ్వు పెట్టారన్నారు. టిడిపి అధికారంలోకి వచ్చిన వెంటనే వడ్డెర్లకు క్వారీలు కేటాయిస్తామని తెలిపారు. నియోజకవర్గం స్థాయిలో ఉప కులాల వారిగా భవనాలు నిర్మిస్తామని, ఆ తరువాత మండలాల వారీగా భవనాలు నిర్మాణం చేపడతామని పేర్కొన్నారు. తిరుమలతో సహా ఇతర దేవస్థానాల్లో దుస్తులు ఉతికే కాంట్రాక్ట్ రజకులకు కేటాయిస్తామన్నారు. టిడిపి హయాంలో బిసిలకు 34 శాతం ఉన్న రిజర్వేషన్లు జగన్ 10 శాతం తగ్గించి బిసిలకు తీరని ద్రోహం చేశారని ఆరోపించారు. 16,500 మంది బిసిలు పదవులు కోల్పోయారని తెలిపారు. జగన్ తగ్గించిన రిజర్వేషన్లు తిరిగి కల్పిస్తామన్నారు. బిసి జనగణన జరగాలని అప్పుడే వారికి న్యాయం జరుగుతుందన్నారు. దీని కోసం ఢిల్లీ స్థాయిలో పోరాడుతున్నామని చెప్పారు. బోయ, వాల్మీకిలను ఎస్టీల్లో చేర్చేందుకు టిడిపి వేసిన సత్యపాల్ కమిటీ రిపోర్ట్‌ని జగన్ మూలన పడేశారన్నారు. 420కి ట్రేడ్ మార్క్‌గా జగన్ ఉన్నారన్నారు. నేను జగన్‌లా రూ.లక్ష కోట్లు దోచి జైలుకి వెళ్ళలేదన్నారు. బాబాయ్‌ని చంపేసి నాట్ టూ అరెస్టు అని కోర్టుకు జగన్ అండ్ కో వెళ్లారని తెలిపారు. కేవలం ప్రజల తరఫున పోరాడినందుకు నాపై అక్రమ కేసులు పెడుతున్నారన్నారు. ఎన్ని కేసులు పెట్టుకున్నా నేను రెడీగా ఉన్నానని తెలిపారు. వైసిపి పాలనలో ధరలు ఆకాశాన్నంటాయన్నారు. నిత్యావసరాలు, పెట్రోల్, డీజిల్ ధరల పెంపు, ఇంటిపన్ను, చెత్తపన్నుతో సామాన్యుల నడ్డి విరుస్తున్నారని తెలిపారు. రానున్న కాలంలో పీల్చే గాలికి కూడా జగన్ రెడ్డి పన్ను వేసేలా ప్రవర్తిస్తున్నాడని పేర్కొన్నారు. జగన్ పాలన తాలిబన్ల పాలనను మించిపోయిందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మంత్రి అమరనాథ్‌రెడ్డి, టిడిపి రాజంపేట పార్లమెంట్ అభ్యర్థి గంటా నరహరి, తంబళ్లపల్లి, మదనపల్లి నియోజకవర్గాల ఇన్‌ఛార్జులు జి.శంకర్ యాదవ్, దొమ్మలపాటి రమేష్, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి ఎస్.ఎం.ఫర్వీన్ తాజ్, రాజంపేట పార్లమెంట్ బిసి సెల్ అధ్యక్షులు పి.సురేంద్ర యాదవ్, బిసి సెల్ రాష్ట్ర అధికార ప్రతినిధి గుత్తికొండ త్యాగరాజు, తెలుగు యువత రాష్ట్ర అధ్యక్షులు శ్రీరామ్ చిన్నబాబు, నియోజకవర్గం తెలుగు యువత అధ్యక్షులు శ్రీనాథ్ రెడ్డి, పెద్దమండ్యం మండల టిడిపి అధ్యక్షులు జిట్టా వెంకటరమణ, మైసూర్ శ్రీనివాసులు యాదవ్, బెస్త సాధికార కమిటీ జిల్లా అధ్యక్షులు ముంబై దుర్గా, మహిళా నాయకులు విజయమ్మ పాల్గొన్నారు.

బాలుడిపై పిచ్చికుక్క దాడి

- పరిస్థితి విషమం
- మెరుగైన చికిత్స కోసం తిరుపతికి తరలింపు

ప్రజాశక్తి-రాజంపేట అర్బన్

ఆరేళ్ల బాలుడిపై పిచ్చికుక్క దాడి చేసి తీవ్రంగా గాయపరిచిన సంఘటన మంగళవారం పట్టణంలో తీవ్ర కలకలం రేపింది. నలంద పాఠశాలలో ఎల్‌కెజి చదువుతున్న ధనుష్ ఇంటికెళ్తున్న సమయంలో ఈ ఘటన చోటుచేసుకుంది. పిచ్చికుక్క దాడిలో ధనుష్ తీవ్రంగా గాయపడటంతో బాలుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. బాలుడి పరిస్థితి విషమంగా విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం అక్కడి నుంచి తిరుపతికి తరలించారు. బాలుడి తల్లిదండ్రులు జీవనోపాధి కోసం గల్ఫ్ దేశానికి వెళ్లగా ధనుష్ తన బాబాయి వద్ద ఉంటున్నారు. ఈ ఘటనపై తీవ్రంగా స్పందించిన మున్సిపల్ కమిషనర్ ఎం.జనార్ధన్‌రెడ్డి సిబ్బందితో కలిసి సంఘటన స్థలానికి చేరుకుని పిచ్చికుక్కను గుర్తించి చంపేశారు. మరోసారి ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా మున్సిపాలిటీ పరిధిలో కుక్కల పైన ప్రత్యేక డ్రైవ్ ఏర్పాటు చేస్తున్నట్లు కమిషనర్ తెలిపారు. మూడు, నాలుగు నెలల నుంచి రాజంపేట పట్టణ వ్యాప్తంగా కుక్కల సంతతి పెరిగి అధిక సంఖ్యలో పట్టణ వీధుల్లో సంచరిస్తూ కాటు వేసి అనేకమందిని గాయపరిచిన సంఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. గుంపులు గుంపులుగా తిరుగుతూ ప్రజలు ఇంటి నుంచి బయటికి రావాలంటేనే భయపడే స్థితిలో స్వైరవిహారం చేస్తున్నా అధికారులలో స్పందన లేదు. ప్రస్తుత ఘటనతో అధికారులు అప్రమత్తమై కుక్కలపైన ప్రత్యేక డ్రైవ్ నిర్వహించనున్నట్లు ప్రకటించడంతో ప్రజలు ఒకింత ఊపిరి పీల్చుకున్నారు.



తీవ్రంగా గాయపడ్డ బాలుడికి చికిత్స చేస్తున్న వైద్యులు

స్టాఫ్‌నర్సుల భర్తీలో గోల్‌మాల్

జిల్లాలో స్టాఫ్ నర్సుల భర్తీలో గోల్‌మాల్ నడిచింది. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్ కింద కడప రీజినల్ డైరెక్టర్ కార్యాలయ యంత్రాంగం పెద్దఎత్తున నర్సింగ్ పోస్టులను భర్తీ చేసింది. దీన్ని ఆసరాగా తీసుకుని చిత్తూరు జిల్లా కేంద్రంగా ఓ గ్యాంగ్ దరఖాస్తుదారుల ఒరిజినల్ మార్కులిస్టుల్లోని మార్కులను హైప్ చేసి బోగస్ మార్కులుగా మార్చి అనర్హులకు ఉద్యోగాలు దక్కేలా చేసిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇటీవల చిత్తూరు జిల్లా కేంద్రంగా వచ్చిన ఫిర్యాదు ఆధారంగా వైఎస్‌ఆర్ హెల్త్ యూనివర్శిటీ ఎనిమిది మంది ఒరిజినల్ మార్కులిస్టులను పరిశీలించి ఉద్యోగాలు పొందిన మార్కులను బోగస్ మార్కులుగా నిర్ధారించి పంపించింది.



బోగస్ మార్కులతో ఉద్యోగాలు
ఏడుగురికి షోకాజ్ నోటీసులు?
చిత్తూరు జిల్లా కేంద్రంగా మాఫియా
మార్కుల మాఫియాపై చర్యలు లేనట్లేనా!

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ 2022 నవంబర్‌లో 957 స్టాఫ్‌నర్స్ పోస్టులకు నోటిఫికేషన్ విడుదల చేసింది. జోన్-4 కేటగిరీ కింద 291 స్టాఫ్‌నర్స్ పోస్టులను కేటాయించింది. కడప ఆర్‌డి కార్యాలయం 2023 జనవరి మూడవ వారంలో స్టాఫ్ నర్స్ పోస్టులను భర్తీ చేసింది. గైడ్‌లెన్స్ ప్రకారం నియమకాలు చేపట్టకపోవడంతో పెద్దఎత్తున విమర్శలు వెల్లువెత్తిన సంగతి తెలిసిందే. స్టాఫ్‌నర్స్ దరఖాస్తులు, కోవిడ్ సేవల సీనియారిటీ పత్రాలు పరిశీలనలో నిర్లక్ష్యం మొదలుకుని బోగస్ మార్కులు, ఫేక్‌సర్టిఫికెట్లతో ఉద్యోగాలు పొందినట్లు సమాచారం. చిత్తూరు జిల్లాకు చెందిన ఓ దరఖాస్తుదారు రిక్రూట్‌మెంట్‌లో మార్కుల ఆధారంగా ఉద్యోగాలు పొందడంపై అనుమానం రావడంతో చేసిన ఫిర్యాదు ఆధారంగా డొంకంతా కదిలింది. రాజధాని కేంద్రంలోని వైఎస్‌ఆర్ హెల్త్ యూనివర్శిటీ 44 అనుమానిత దరఖాస్తుల్లో 15 దరఖాస్తులను పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. వీటిలో ఎనిమిది మంది మార్కులను బోగస్ మార్కులుగా నిర్ధారించింది. చిత్తూరు వైద్య విధాన పరిషత్ పరిధిలో ఆరుగురు, ఆర్‌డి కార్యాలయ పరిధిలోఉద్యోగాలు పొందిన ఇద్దరు, ఒకరు ఉద్యోగంలో చేరాల్సి ఉన్నట్లు తేలింది. వీరిద్దరికి ఆర్‌డి కార్యాలయం షోకాజ్ నోటీసులు పంపించినట్లు సమాచారం. మిగిలిన ఆరుగురికి వైద్యవిధాన పరిషత్ అధికార యంత్రాంగం షోకాజ్ నోటీసులు జారీ చేయాల్సి ఉన్నట్లు తెలుస్తోంది. గతంలో చోటుచేసుకున్న ఇటువంటి ఘటనలో కేసు నమోదు చేసి, సూపరింటెండెంట్‌ను సస్పెండ్ చేసిన సంగతి తెలిసిందే. తాజా ఉదంతంలో ఇటువంటి దిశగా ఆలోచనలు చేయకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ సిఐడి దర్యాప్తునకు ఆదేశించాలనే డిమాండ్ ఉద్యోగ, కార్మిక సంఘాల నుంచి వినిపిస్తోంది.

బోగస్ మార్కుల మాట వాస్తవమే

స్టాఫ్‌నర్సుల రిక్రూట్‌మెంట్‌లో ఎనిమిది మంది ఒరిజినల్ మార్కులిస్టుల్లోని మార్కులను హైప్ చేసిన మార్కులు బోగస్‌గా తేలిన మాట వాస్తవమే. వీరిలో ఏడుగురు ఉద్యోగాల్లో ఉన్నారని, ఇద్దరికి షోకాజ్ నోటీసులు జారీ చేస్తాం. మిగిలిన వారికి రాష్ట్ర వైద్య విధాన పరిషత్ షోకాజ్ నోటీసులు పంపించాల్సి ఉంది. వీరిపై క్రిమినల్ కేసులు నమోదు చేసే ఆలోచనలు ఉన్నాయి.

- డాక్టర్ కోటేశ్వరి, రీజినల్ డైరెక్టర్, కడప.

నేటి నుంచి ఇంటర్ పరీక్షలు

- ఏర్పాట్లు పూర్తి చేసిన అధికారులు
- పరీక్షా కేంద్రాల్లో సిసి కెమెరాల ఏర్పాటు
- ఒక్క నిమిషం నిబంధన

ప్రజాశక్తి-రాయచోటి

జిల్లా వ్యాప్తంగా బుధవారం నుంచి ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు ప్రారంభం కానున్నాయి. ఈ పరీక్షలకు అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. రాయచోటి, రాజంపేట, రైల్వేకోడూరు, పీలేరు, మదనపల్లె, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో పరీక్షలు నిర్వహించనున్నారు. జిల్లా వ్యాపితంగా 52 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. 28,380 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారు. మొదటి సంవత్సరం 13,934, రెండవ సంవత్సరం 14,446 మంది రాయబోతున్నారు. పరీక్ష ఉదయం ఉదయం 9 గంటల నుండి 12 వరకు పరీక్షలు నిర్వహించనున్నారు. విద్యార్థులు 30 నిమిషాల ముందే పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని, ఒక్క నిమిషం ఆలస్యమైనా అనుమతించమని అధికారులు చెబుతున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంది. పరీక్ష సెంటర్ల వద్ద జిరాక్స్ షాపులు కూడా మూసివేంచారు. పరీక్ష కేంద్రాలలో సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తున్నారు. ప్రభుత్వ కళాశాలలో రెగ్యులర్‌గా పనిచేసే వారిని మాత్రమే ఇన్విజిలేటర్లుగా నియమించారు. జిల్లా వ్యాప్తంగా ఫ్లయింగ్ సబ్‌స్క్వాడ్ 4, సిట్టింగ్స్ స్క్వాడ్స్ 10, హెచ్‌పిసి స్క్వాడ్ 1, డిఐఒ ఒకరు, మొత్తం 1182 మంది ఇన్విజిలేటర్లను నియమించారు.

పకడ్బందీగా నిర్వహిస్తాం : ఇంటర్ పరీక్షలను పకడ్బందీగా నిర్వహిస్తామని జిల్లా ఇంటర్ ఎడ్యుకేషన్ అధికారి ఎం. కృష్ణయ్య పేర్కొన్నారు. మంగళవారం ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నామని చెప్పారు. ఎక్కడా మాస్ కాపీయింగ్ జరగకుండా సిసి కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. సెంటర్ల వద్ద విద్యార్థుల కోసం ఎఎన్‌ఎంలను అందుబాటులో ఉంచామన్నారు. 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ఎవరైనా అవాంఛనీయ సంఘటనకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న వ్య.కా.స రాష్ట్ర నాయకులు శ్రీనివాసులు

పేదలకు భూ పంపిణీ చేయాలి : వ్య.కా.స


ప్రజాశక్తి-ఓబులవారిపల్లి

పేదలకు భూములు పంపిణీ చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పి.శ్రీనివాసులు అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బాలిరెడ్డిపల్లి గ్రామంలోని బాలాజినగర్ లో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో భూపోరాటం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాలాజినర్, శివాజినగర్, బాలిరెడ్డిపల్లి దళితవాడల్లోని భూమిలేని గ్రామస్తులకు వెంటనే భూ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. దొంగ పాస్‌బుక్‌లను ఆన్‌లైన్‌లను రద్దు చేయాలన్నారు. భూమిని స్వాధీనం చేసుకొన పేదలకు సాగు పట్టాలు ఇవ్వాలని తెలిపారు. లేని పక్షంలో తహశీల్దారు కార్యాలయాన్ని ఈ నెల 27 తేదీన ముటడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎం.జయరామయ్య, పందికాళ్ళ మణి, సిఐటియు జిల్లా అధ్యక్షులు సి.హెచ్.చంద్రశేఖర్, మండల కార్యదర్శి కె.వెంకటరమణ, కె.కేశవులు, రైతు సంఘం నాయుకులు సి.హరి, రమణ, గ్రామస్తులు పాల్గొనారు.

నల్లబ్యాడ్జీలతో ఉద్యోగుల నిరసన

ప్రజాశక్తి - పుల్లంపేట

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఉద్యోగ జెఎసి ఆదేశాల మేరకు మంగళవారం ఎపిజెఎసి జిల్లా అధ్యక్షులు నరసింహ కుమార్ ఆధ్వర్యంలో స్థానిక విద్యాశాఖ అధికారి భవనం వద్ద మధ్యాహ్నం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులకు రావాల్సిన డిఎ, టిఎ, బిఆర్‌ఎ, తదితర ఆర్థికేతర ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ప్రతిరోజు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తామన్నారు. ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, ప్రభుత్వంలో ఉద్యోగుల పాత్ర ఎంతో కీలకమైనదని పేర్కొన్నారు. ప్రతి ఉద్యోగి చాలీచాలని జీతాలతో సతమతమవుతున్నారని చెప్పారు. ప్రతి నెల ఒకటవ తేదీన జీతాలు అందజేయాలన్నారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారి రంగనాథయ్య, వీఆర్వోలు సోమశేఖర్ రెడ్డి, అంజయ్య, విఆర్‌ఎలు శ్రీను రెవెన్యూ సిబ్బంది, ఎమ్మార్పీ శివ, మండల విద్యా ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.



నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేస్తున్న ఉద్యోగులు



దశాబ్ద ఉత్సవాల్లో పాల్గొన్న ప్రిన్సిపల్, అధ్యాపకులు, విద్యార్థులు

ఘనంగా జెఎన్‌టియు దశాబ్ది ఉత్సవాలు

ప్రజాశక్తి-కలికిరి

జెఎన్‌టియు కళాశాల స్థాపించి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఉత్సవాలను మంగళవారం ప్రిన్సిపల్ ఎస్.వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎన్ఎస్-ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ కె.అపర్ణ ఆధ్వర్యంలో మన దేశ సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా అధ్యాపకులు, విద్యార్థులు సంప్రదాయ దుస్తులను ధరించి కళాశాలకు వచ్చారు. విద్యార్థులు మన దేశ సంప్రదాయాలకు తగ్గట్టుగా బతుకమ్మ, కోలాటం, దాండియా, ఆటలను పాటలను ఆడి పాడారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ కళాశాల దశాబ్ది ఉత్సవాలు నిర్వహించడం చాలా ఆనందంగా ఉందని తెలిపారు. కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ సుభాష్ మాట్లాడుతూ విద్యార్థులందరూ మన దేశ సంస్కృతి సంప్రదాయాలు తగ్గట్టుగా వస్త్రధారణలో రావడం చాలా ఆనందంగా ఉందన్నారు. డాక్టర్ అపర్ణ మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు చేయడం ద్వారా పిల్లలు సమైక్య భావాలు కలిగి మన ఆచార వ్యవహారాలు సంప్రదాయాలు అందరిలో ప్రబలుతాయని తెలిపారు. కార్యక్రమంలో వివిధ విభాగాధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


రుణాలు సక్రమంగా చెల్లించాలి

ప్రజాశక్తి-వీరబల్లి

డ్వాక్రా మహిళలు సంఘాల్లో తీసుకున్న రుణాలు సక్రమంగా చెల్లించాలని ఎపిఎం ఖాదర్‌వలీ కోరారు. మంగళవారం పెద్దివీడు పంచాయతీ గ్రామాఖ్య-1 కార్యనిర్వాహక సమావేశం అధ్యక్షులు మున్నీ ఆధ్వర్యంలో పంచాయతీ తీసుకున్న రుణాలు సక్రమంగా తిరిగి చెల్లిస్తే కొత్త రుణాలు తీసుకోవ్చన్నారు. ఎంఎల్‌హెచ్‌పి స్వాతి మాట్లాడుతూ అనిమియా పట్ల జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా ఆకు, కూరగాయలు, పాలు వంటి పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. బాల్య వివాహాల నివారణకు అవగాహన కల్పించాలన్నారు. ప్రతి నెలా నిర్వహించే మహిళల ఆరోగ్య సమస్యలు నివృత్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో కోశాధికారి ఖాదీరున్, విఒఎ ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఖాదర్‌వలీ



సమావేశంలో మాట్లాడుతున్న తులసిరెడ్డి

ఆరు సూత్రాలను అమలు చేస్తాం

ప్రజాశక్తి - రాయచోటి

రాష్ట్రంలో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి పని అయిపోయిందని, వైసిపి నాయకులు కార్యకర్తలు తిరిగి కాంగ్రెస్ పార్టీలో రావాలని, రాష్ట్రంలో ఆరు సూత్రాలు కార్యక్రమాన్ని అమలు చేస్తామని పిసిసి మీడియా చైర్మన్ డాక్టర్ తులసి రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి అల్లాబకాష్‌తో కలిసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినా వైసిపి చిత్తుచిత్తుగా ఓడిపోతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో అన్ని వర్గాల ప్రజలు జగన్ ప్రభుత్వంపై అసంతృప్తితో ఉన్నారని చెప్పారు. ఉద్యోగులు, యువత కాంట్రాక్టర్, సర్పంచులు ఆగ్రహంతో ఉన్నారన్నారు. అప్పులు, అవినీతి, అరాచక, మధ్య, జూదం, గంజాయి ,డ్రగ్ ఆంధ్రప్రదేశ్ గా మారిందని ఆరోపించారు. ల్యాండ్, శాండ్, మైన్, వైను, ఎర్రచందనం, బియ్యం మాఫియా రాజ్యమేలుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం వస్తుందని, వైసిపి నాయకులు పార్టీలకు తిరిగి తిరిగి రావాలని పిలుపునిచ్చారు. రాహుల్ గాంధీని ప్రధాన చేయడమే తన జీవిత ఆశయం అని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే ఆరు లక్షల రూపాయల వరకు వ్యవసాయం రుణమాఫీ, రూ.500 లకే వంట గ్యాస్ సిలిండర్, ప్రతి నిరుపేద కుటుంబానికీ నెలకు రూ.6 వేల ఆర్థిక సాయం, ప్రత్యేక హోదా, అమలు చేస్తామన్నారు. కడప జిల్లాలో ఉక్కు కర్మ గార, రాజధానిగా సహ విభజన చట్టంలో పేర్కొన్న అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు సమావేశంలో కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ జంగా గౌతమ్, ఎపిసిసి సభ్యులు శంకర్, కడప జిల్లా అధ్యక్షులు శ్రీనివాసరావు, నజీర్ అహ్మద్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు గౌస్, చెన్న కృష్ణ, మహమ్మద్ రఫీ పాల్గొన్నారు.

18న సంత వేలం పాట

ప్రజాశక్తి- గాలివీడు

పశువులు, కూరగాయల సంత, బస్టాండ్ గేటు వేలంపాట ఈనెల 18న నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి సురేష్‌కుమార్, సర్పంచి లక్ష్మిదేవమ్మ సంయుక్త ప్రకటలో పేర్కొన్నారు. శనివారం మధ్యాహ్నం 2 గంటలలోపు డిపాజిట్లను గ్రామపంచాయతీ కార్యాలయంలో చెల్లించాలన్నారు. పశువుల సంతకు రూ.2 లక్షలు, కూరగాయల సంతకు రూ.1.50 లక్షలు, బస్టాండు గేటుకు రూ.50 వేలు నగదు రూపంలో డిపాజిట్లు చెల్లించిన వారు మాత్రమే వేలంపాటలో పాల్గొనడానికి అర్హులౌతారన్నారు.




కార్ల్‌మార్క్స్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

చరిత్రను మలుపు తిప్పిన కార్ల్ మార్క్స్

రాయచోటి టౌన్ : మానవ చరిత్రను మలుపు తిప్పిన మహనీయుడు కార్ల్‌మార్క్స్ అని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జాబీర్, సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.రామాంజులు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సిఐటియు కార్యాలయంలో మార్క్స్ 140వ వర్ధంతి సందర్భంగా స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మిక వర్గ శ్రేయస్సుకు ప్రపంచ దేశాలు తిరుగుతూ తన జీవితం మొత్తం దారపోశారని చెప్పారు. శ్రమ జీవుల శ్రమకు తగ్గ వేతనం తీసుకోవాలని, అది పోరాటాల ద్వారా సాధ్యమని చెప్పారన్నారు. ప్రస్తుతం దుర్మార్గపు దోపిడీ వ్యవస్థ సమర్థకులు మార్క్సిజానికి కాలం చెల్లిందని కారకుతలు కూస్తున్నా ఇప్పటికీ ప్రపంచంలోని కోట్లాది కార్మికులు పీడిత, బడుగు బలహీన వర్గాలు తమ విముక్తి కోసం మార్క్సిజం వెలుగులు పోరాడుతున్నాయన్నారు. ఒక దశాబ్దంలోనే రెండు పెట్టుబడి దారీ సంక్షోభాన్ని ప్రపంచం చవిచూస్తున్న తరుణంలో సమాజాన్ని ముందుకు నడిపించగల చోదక శక్తి మార్క్సిజమే అని తెలిపారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు బంగారుపాప, ఎస్.ఫయాజ్, ఖాజాబి, సిద్ధమ్మ, పార్వతి పాల్గొన్నారు.

కోర్టు భవన నిర్మాణానికి సహకరించండి

నందలూరు: వందేళ్లకు పైగా చరిత్ర గల నందలూరు జూనియర్ సివిల్ జడ్జ్ కోర్టు, నూతన భవన నిర్మాణాల కోసం సహకరించాలని హై కోర్ట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ అమరావతిలో హైకోర్టు జడ్జి, కడప జిల్లా పోర్టుఫోలియో జడ్జి ఎన్.జయసూర్య, హైకోర్టు అడ్మినిస్ట్రేటివ్ రిజిస్ట్రార్ గిరిధర్‌లను ఉమ్మడి కడప జిల్లాలలోని నందలూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు దాసరి నరసింహులు కోరినట్టు తెలియజేశారు. ఆయన మాట్లాడుతూ సమస్యను సానుకూలంగా విన్న వారు సానుకూలంగా స్పందించి నూతన భవన నిర్మాణాల కోసం సహకరిస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. తన వెంట స్థానిక బార్ అసోసియేషన్ సెక్రటరీ గొబ్బిళ్ళ సుబ్బరామయ్య, జాయింట్ సెక్రటరీ నాయన పల్లి అనుదీప్ జయసింహా, సీనియర్ అడ్వకేట్ చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారని తెలిపారు.



హైకోర్టు జడ్జి జయసూర్యను కలిసిన నరసింహులు



బహుమతి అందుకొంటున్న విద్యార్థి

ఆన్‌లైన్ పోటీ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-కురబలకోట

ఆన్‌లైన్ పోటీ పరీక్షల్లో మండలంలోని విద్యార్థులు ప్రతిభ చూపినట్లు ఎంఇఒ ద్వారకనాథ్ తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ 10, 7వ తరగతి చదువుతున్న విద్యార్థులకు ఎన్‌జిఒ వారు పోటీ పరీక్షలు నిర్వహించారన్నారు. ఈ పోటీ పరీక్షల్లో మండలంలోని మోడల్ స్కూల్ 10వ తరగతి చదువుతున్న మల్లికార్జున జిల్లా మొదట స్థానం సాదించారన్నారు. సిద్దారెడ్డిగారిపల్లి ప్రాథమిక పాఠశాలలో 7వ తరగతి చదువుతున్న డింపుల్ స్నేహితరెడ్డి ప్రతిభ కనబరిచారన్నారు. విద్యార్థులకు సిలబస్ 80 శాతం, జనరల్ నాలెడ్జ్‌లో 20 శాతం రెండు కలిపి ఎడ్యుకేషన్ పోటీ పరీక్షలు నిర్వహించారన్నారు. పరీక్షల్లో రాష్ట్ర స్థాయిలో మూడవ ర్యాంకు సాధించి పది రూ.వేల క్యాష్ అవార్డు, సర్టిఫికెట్‌ను పొందడం జరిగిందన్నారు. విద్యార్థులను పాఠశాల ఉపాధ్యాయులు అభినందించారు. కార్యక్రమంలో ఎంపిపి దస్తగిరి, ఎంపిడిఒ దిలీప్ కుమార్, ప్రిన్సిపల్ యోజన గాంధి, విద్యార్థులు పాల్గొన్నారు.

చేపల చెరువు వేలంలో రూ.77 వేలు ఆదాయం

ప్రజాశక్తి-నిమ్మనపల్లి

చేపల ఫలసాయానికై తవళం గ్రామంలోని చెరువులకు మంగళవారం బహిరంగ వేలం పాటను సర్పంచు కె.రెడ్డప్ప, ఎంపిడి లీలా మాధవి ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తవళం గ్రామంలోని 12 చెరువులకు 30-06-2023 వరకు కాలపరిమితికి బహిరంగ వేలం పాటను నిర్వహించామాన్నారు. ఇందులో సాకిరేవు ఒడ్డును శ్రీరాంపురంకు చెందిన రమణ రూ.33,500కు, ఎర్రమరెడ్డి చెరువును ఉప్పరపల్లికు చెందిన వెంకటరమణ రూ.42,500కు, దేవళం కుంటను లక్ష్మయ్య రు.1500వేలంపాటలో దక్కించుకున్నట్లు తెలిపారు. మొత్తంగా తవళం పంచాయతీకి రూ.77,500 ఆదాయం సమకూరిందన్నారు. ఎగువ చెరువు, గంగాసాగరం ఒడ్డును నీటి లోతు అధికంగా ఉన్నందున చేపలు పట్టడానికి ఇబ్బందిగా ఉందంటూ పాటదారులు వేలంలో ఆసక్తి చూపలేదు అన్నారు. వేలం ద్వారా వచ్చిన ఆదాయాన్ని పంచాయతీ అభివృద్ధికి ఉపయోగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డప్ప, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, సచివాలయ సిబ్బంది, వేలంపాటదారులు పాల్గొన్నారు.

అందుబాటులో నూనె తయారీ యంత్రం

ప్రజాశక్తి-కలికిరి

కృషి విజ్ఞాన కేంద్రంలో వివిధ రకాలైన నూనె గింజలు అనగా వేరుశనగ, నువ్వులు, పొద్దుతిరుగుడు, కొబ్బెరి నుండి స్వచ్ఛమైన నూనె తీయుయంత్రం అందుబాటులో ఉన్నదని కో-ఆర్డినేటర్ డాక్టర్ పాండురంగ తెలిపారు. మంగళవారం కేవీకేలో ఆయన మాట్లాడుతూ యంత్రం ద్వారా రోజుకు 150-170 కిలోల గింజలు ఆడించవచ్చును. అవసరం అయిన రైతులు కిలోకు తొమ్మిది రూపాయలు చొప్పున ఖరీదు చెల్లించి గింజలతో స్వఛమైన నూనె తయారు చేసుకోవచ్చని, ఈ సదుపాయాన్ని కలికిరి చుట్టుపక్కల రైతులు, ప్రజలు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా సమన్వయకర్త డాక్టర్ జి ఎస్ పాండురంగ, జ్యోతి గృహ విజ్ఞాన శాస్త్రవేత్త తెలిపారు.

ప్రభుత్వ ఉద్యోగాలకు వేదవ్యాస విద్యార్థులు ఎంపిక

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

స్థానిక నెహ్రూ రోడ్డులోని వేదవ్యాస డిగ్రీ కళాశాల విద్యార్థులు మరోసారి తమ సత్తా చాటారు. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపికై అందరి ప్రశంసలు అందుకున్నారని కరస్పాండెంట్ ఎల్.నాగేశ్వరరెడ్డి తెలిపారు. ఆ మేరకు మంగళవారం ఆయన మాట్లాడుతూ కళాశాలలో మొదటి సంవత్సరం చదువుతున్న కె.కావ్య, జి.రాహుల్, సి.వసంత్ కేంద్ర ప్రభుత్వం నిర్వహించిన గ్రామ డాక్ సేవక్ ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. విద్యార్థుల్లోని ప్రతిభను గుర్తించి కళాశాలలో ప్రత్యేకంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలపై అవగాహన కల్పిస్తు, వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నామన్నారు. కళాశాల నుంచి ఇప్పటికే అనేక మంది విద్యార్థులు పలు ప్రముఖ సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారన్నారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు ఎంపిక కావడంపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. రానున్న రోజుల్లో కూడా విద్యార్థులకు మెరుగైన శిక్షణ, ఉద్యోగాలు సాధించేందుకు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రెసిడెంట్ జి.సుదర్శనరెడ్డి, ఎన్‌ఎస్‌ఎస్ ప్రొగ్రామ్ ఆఫీసర్స్ కె.నాగరాజ, వి.రామలక్ష్మిరెడ్డి, సృజన్ కోచింగ్ నిర్వహకులు, అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.

పంట నమోదులో తప్పులుంటే సవరించుకోవాలి

ప్రజాశక్తి - ముద్దనూరు

పంట నమో దులో ఏవైనా తప్పులుంటే సవరిం చుకోవాలని ఎడిఎ వెంకట సుబ్బయ్య రైతులకు సూచిం చారు. స్థానిక వ్యవసాయ శాఖ కార్యాల యంలో మండలి చైర్మన్ దస్తగిరి అధ్యక్షతన మంగళ వారం ఎడిఎ ఆధ్వర్యంలో వ్యవసాయ సలహా మండలి సమా వేశం నిర్వహించారు. ఈ సం దర్భంగా ఎడిఎ, ఎఒ వెంకట కృష్ణారెడ్డి మాట్లాడుతూ రైతుల సమస్యలపై ప్రతి నెల మండలస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశాన్ని నిర్వహిం చనున్నట్లు తెలిపారు. గ్రామస్థాయిలో పరిష్కారం కానీ సమస్యలను మండల స్థాయిలో చర్చించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో పలువురు రైతులు టార్పాలిన్ పట్టలు, బ్యాటరీ పంపులు, పవర్ స్ప్రేయర్లు, వ్యక్తిగత పని ముట్లు, విత్తనం గోర్లు, గుంటకలు, కల్టివేటర్లు అడుగుతున్నారని సిబ్బంది అధికారుల దృష్టికి తెచ్చారు. సంబంధించిన డీలర్లతో మాట్లాడి రైతులు పొ లాల్లో డ్రిప్ పరికరాలు అమార్చేలా చూడాలన్నారు. శనగలకు ప్రభుత్వం నిర్ణ యించిన మద్దతు ధరకు అమ్ముకునేలా అవగాహన కల్పించాలన్నారు.

ప్రణాళికతో చదివితే.. మానసిక ఒత్తిడి ఉండదు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

ప్రణాళికతో చదివితే మానసిక ఒత్తిడి ఉండదని పాడా ఒఎస్‌డి అనిల్‌కుమార్ రెడ్డి తెలిపారు. కనడా దేశానికి చెందిన ఒటిఎఫ్ సంస్థ వారి సహకారంతో మంగళ వారం స్నేహిత అమృత హస్తం సేవాసమితి ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాల, ఉర్దూ ఉన్నత పాఠశాల, బ్రాహ్మణపల్లి ఉన్నత పాఠశాలలలోని 10వ తరగతి పరీక్షలకు హాజరువుతున్న బాలికలకు ఒఎస్‌డి, ఎంఇఒ వీరారెడ్డి, ప్రధానోపాధ్యాయురాలు పద్మావతమ్మ, సేవాసమితి అధ్యక్షులు రాజు పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అనిల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి పరీక్షలు అనే భయం వీడాలన్నారు. ప్రతి బాలిక ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆయన ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, సేవాసమితి సభ్యులు చాంద్ బాషా, హరీష్ పాల్గొన్నారు.

నులిపురుగులను నివారిద్దాం : డిఎంహెచ్‌ఒ



పీలేరు : విద్యార్థికి మాత్రలు వేస్తున్న మాజీ ఎమ్మెల్యే శ్రీనాథ్‌రెడ్డి

ప్రజాశక్తి- రామాపురం

పిల్లల్లో నులిపురుగులు ఉండడం వల్ల పెరుగుదల, రక్తహీనత, బుద్ధిమాంద్యం ఏర్పడుతుందని, నివారణకు అందరం కృషి చేయాలని డిఎంహెచ్ఒ కొండయ్య పిలుపునిచ్చారు. మండలంలోని కస్తూరిబా అంబేద్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులు అల్బెండజోల్ మాత్రలను భోజనం తరువాత మిగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి ఆరోగ్య విద్య పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. భోజనానికి ముందు చేతులను శుభ్రంగా కడుకోవాలని, అలా చేయడం వల్ల వ్యాధులను నివారించ కోవచ్చని చెప్పారు. గోర్లను పెరగకుండా కత్తిరించుకోవాలని తెలిపారు. మండల వైద్యాధికారి విజయ్ కుమార్ మాట్లాడుతూ మండలంలో 8419 పిల్లలకు తొలి రోజు ప్రభుత్వ ప్రయివేట్ పాఠశాలల్లో, అంగన్వాడీ కేంద్రాల్లో మాత్రలను పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో వినోద్‌కుమార్ సిహెచ్ఒ ఏలియ, జెపిహెచ్ఎన్ విజయకుమారి, హెల్త్ సూపర్‌వైజర్లు రాఘవేంద్ర రాజు, ఉమామహేశ్వరి , ఎఎన్ఎంలు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు. **రాయచోటి :** పట్టణంలోని వాల్మీకి వీధిలో ఉన్న ఎపి ట్రైబల్ వెల్ఫేర్ గురుకుల పాఠశాలలో అన్నమయ్య జిల్లా ఆర్‌బిఎస్‌కె అధికారి డాక్టర్ శేషగిరి బాబు ఆధ్వర్యంలో మధ్యాహ్నం భోజనం తరువాత అల్బెండజోల్ మాత్రలను మింగించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ మహ్మద్ రఫీ, ప్రిన్సిపల్ లత, డిఇఒ వీరనరసింహులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **గాలివీడు :** నులిపురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యా ధికారి మాధవి పేర్కొన్నారు. స్థానిక పిహెచ్‌సి పరిధిలో ఏడాది నుంచి 19 ఏళ్ల కల్గిన 3000 మంది విద్యార్థులకు నులిపురుగు నివారణకు మాత్రలను పంపిణీ చేశామన్నారు కార్యక్రమంలో పిహెచ్ఎన్ఎం షమీమ్‌తార, ఎఎన్ఎం జ్యోతి, ఆశా వర్కర్లు రమణమ్మ, లక్ష్మీదేవి, నాగేశ్వరమ్మ, వైద్య ఆరోగ్య సిబ్బంది, ప్రభుత్వ, ప్రయివేట్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **సంబేపల్లి :** మండలంలోని శిబ్యాల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యండపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు డాక్టర్ జి. దివ్యవాణి ఆధ్వర్యంలో అల్బెండజోల్ మాత్రలు అందజేశారు. కార్యక్రమంలో మల్టీ పర్పస్ హెల్త్ అసిస్టెంట్ యర్రపురెడ్డి విశ్వనాథరెడ్డి, ఎఎన్ఎం వి.సరస్వతి, ఎంఎల్‌పిహెచ్‌పి ఎ. శిరీష, సచివాలయ ఎఎన్ఎం ఎం.ఎం. అంజనమ్మ, ఆశాకార్యకర్తలు ఎం. రమాదేవి, లత, జ్యోతి పాల్గొన్నారు. **పీలేరు:** పిల్లల్లో చురుకైన మేథస్సు మెరుగైన ఆరోగ్యంతోనే సాధ్యమని పీలేరు మాజీ ఎమ్మెల్యే జివి శ్రీనాథ్ రెడ్డి, సర్పంచ్ డాక్టర్ షేక్ హబీబ్ బాష, డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం పురస్కరించుకుని పీలేరు పట్టణంలోని కోటపల్లి, అయ్యప్పరెడ్డి కాలనీలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలల్లో విద్యార్థినుల చేత డివార్మింగ్ మాత్రలు మ్రింగించారు. కార్యక్రమంలో పర్యవేక్షకులు కుసుమ, ఏఎన్ఎం భార్గవి, సిహెచ్ఓ చంద్రకళ, పాఠశాలల హెచ్ఎంలు పద్మావతి, ఎన్. జయమ్మ, ఉపాధ్యాయులు ఆశ కార్యకర్తలు విద్యార్థులు పాల్గొన్నారు. **కలికిరి :** మహిళా డిగ్రీ కళాశాలలోని ఎస్.డబ్ల్యూ.ఆర్ ప్రభుత్వ బాలికల డిగ్రీ కళాశాల, కలికిరిలో జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం జిల్లా వైద్య, ఆరోగ్య అధికారియైన డాక్టర్ పి.లోకవర్ధన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. జాతీయ నూరు పురుగుల దినోత్సవం సందరేగా ఆయన డిగ్రీ కళాశాల విద్యార్థినులతో నులిపురుగుల దినోత్సవంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మేడికుర్తి పిహెచ్‌సి డాక్టర్ కావ్య, కళాశాల వైస్ ప్రిన్సిపల్ గులాబ్ జాన్ పాల్గొన్నారు. **లక్కిరెడ్డిపల్లి :** నులిపురుగులు కడుపులో ఉండటం వల్ల విద్యార్థులలో రక్తహీనతను పెంచుతాయి అందుకోసమే ప్రతి విద్యార్థి నులిపురుగు మాత్రలు తప్పక తీసుకోవాలని కోనంపేట వైద్య అధికారి డాక్టర్ సిద్దయ్య పేర్కొన్నారు. స్థానిక ఏపీ మోడల్ స్కూల్లో విద్యార్థులకు నులిపురుగులు మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ రేఖ, విద్యార్థులు పాల్గొన్నారు **కురబలకోట:**విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలను పంపిణీ చేసినట్లు కురబలకోట మండల వైద్యాధికారి శ్రీధర్ తెలిపారు. కార్యక్రమంలో సిహెచ్ఒ జయచంద్ర కుమార్, పర్యవేక్షకులు, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్య కర్తలు, అంగన్వాడీ కార్యకర్తలు మరియు స్కూల్ టీచర్స్ పాల్గొన్నారు. **పుల్లంపేట:** మండల పరిధిలోని స్థానిక ఎస్‌బివిడి సభ హై స్కూల్, ఏపీ మోడల్ స్కూల్‌లో నులిపురుగుల దినోత్సవం సందర్భంగా డాక్టర్ సానే శేఖర్ డాక్టర్ మనోజ్ చంద్ర, మండల విద్యాశాఖ అధికారి రంగనాథయ్య ఆధ్వర్యంలో విద్యార్థులకు నులిపురుగుల మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ప్రకాశం, ఎంఇఒ రంగనాథయ్య, ఏపీ మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ శ్రీహరి, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సుబ్బారెడ్డి, స్పెషల్ ఆఫీసర్ సుచరిత, ఉపాధ్యాయులు ఆశా వర్కర్లు అంగన్వాడీ టీచర్లు సూపర్వైజర్లు స్థానిక వైద్య సిబ్బంది విద్యార్థులు పాల్గొన్నారు. **కలకడ:** చిన్నారుల ఆరోగ్యం మన అందరి బాధ్యతని కలకడ, ఎర్రకోటపల్లి వైద్యాధికారులు కిషోర్ కుమార్‌రెడ్డి, మల్లికార్జున తెలియజేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎర్రకోటపల్లి ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న చిన్నారులకు జాతీయ నిలువుల నివారణ దినోత్సవ సందర్భంగా ఆల్బెండజోల్ మాత్రలు పంపిణీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కలకడ ఎర్రబాటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల సిబ్బంది, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు. **నందలూరు:** జాతీయ నులిపురుగుల దినోత్సవం సందర్భంగా మండలంలోని 61 స్కూళ్లు, మూడు కాలేజీలు, 57 అంగన్వాడి సెంటర్లలో 9678 విద్యార్థులకు ఆల్బెండజోల్ టాబ్లెట్లను పంపిణీ చేసినట్లు ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ సృజన తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ అశ్విని చంద్ర, సిహెచ్ఒ వెంకటనారాయణ, టిబి సూపర్వైజర్ జయప్రకాష్, వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు. **మదనపల్లె అర్బన్:** నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణంలోని వివిధ పాఠశాలల్లో పిల్లలకు అల్బెన్డజోల్ మాత్రలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా వర్ఫ్ బోర్డు చైర్మన్ ఎస్ ఏ. కరీముల్లా పాల్గొన్నారు. **తంబళ్లపల్లి :** పిల్లలకు కడుపులో నులిపురుగుల నివారణకు ఆల్బెండోజోల్ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు కోసువారిపల్లి పిహెచ్‌సి డాక్టర్ నిరంజన్ కుమార్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ ఆనంద్ కుమార్, ఎంఇఒ త్యాగరాజు, ఎంపిహెచ్ఇఒ రమణ, సిహెచ్ఓ సుమతి, పీహెచ్ఎం సుమలత పాల్గొన్నారు.

చైతన్యం ఉంటే వినియోగదారుల హక్కులు రక్షించొచ్చు

ప్రజాశక్తి-ప్రొద్దుటూరు

ప్రజల్లో చైతన్యం, వాడకపు వస్తువుల్లో ప్రత్యామ్నాయం, ఇందుకు ప్రభుత్వ సహకారం ఉంటే వినియోగదారల హక్కుల పరిరక్షింపబడుతాయని ప్రొద్దుటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు గొర్రె శ్రీనివాసులు అన్నారు. బుధవారం అంతర్జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవం సందర్భంగా ఆయన మంగళవారం 'ప్రజాశక్తి'తో మాట్లాడారు. ఒక వస్తువు వినియోగానికి పనికిరాకుండా పోయిందని, వినియోగదారులు గ్రహించిన అనంతరం న్యాయపోరాటం చేయాలనే చైతన్యం కలగాలని సూచించారు. ఆ వస్తువుకు ప్రత్యామ్నాయం ఉండాలని ఈ రెండిటికీ అంటే న్యాయ పోరాటానికి, ప్రత్యామ్నాయానికి ప్రభుత్వ సహకారం ఉంటే వినియోగదారులు గెలుస్తారని


బార్ అసోసియేషన్ అధ్యక్షులు శ్రీనివాసులు

ఆయన అభిప్రాయపడ్డారు. బీమా సంస్థల్లో ప్రభుత్వ సంస్థ అయిన ఎల్ఐసి కొంత వరకు మెరుగైన సేవలందిస్తున్నప్పటికీ, ప్రయివేటు బీమా సంస్థలు కేవలం తమ ఏజెంట్ల వ్యాపార లక్ష్యం పూర్తి చేసేందుకు పూర్తి నిబంధలను దాచి ఉంచి వ్యాపారాన్ని సాగించడం ఆమోదయోగ్యం కాదన్నారు. వినియోగదారులు పరిరక్షణ చట్టం 1986 వచ్చిందన్నారు. 2019లో బలోపేతం అయిందన్నారు. తాము గతంలో వినియోగదారుల చైతన్యం కోసం పలు కార్యక్రమాలు చేశామన్నారు. మెడికల్ మాఫియా ఇంకా ఎక్కువగా ఉందని వినియోగదారులు చైతన్యవంతులైతే ఇలాంటి మాఫియాను రూపుమాపొచ్చన్నారు. వినియోగదారుల రక్షణకు యాక్ట్ ఇన్ డెరొగేషన్ (అదనపు చట్టం) ఉందన్నారు. వినియోగదారులకు అవసరమైన అన్ని చట్టాలకు ఈ చట్టం అదనం అన్నారు. నాణ్యతతో రాజీ పడకపోవడం, అవగాహన, ప్రభుత్వ సహకారం ఉంటే ప్రతి పోరాటంలో వినియోగదారుడే అంతిమ విజేతగా నిలుస్తాడని న్యాయవాది గొర్రె శ్రీనివాసులు తెలిపారు.

వచ్చే ఎన్నికల్లో ఐక్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి - వేంపల్లె

వచ్చే ఎన్నికల్లో కూడా ఐక్యంగా పార్టీ కోసం పని చేయాలని ఎమ్మెల్సీ బిటెక్ రవీంద్రారెడ్డి సూచించినట్లు వేంపల్లె మండల టిడిపి నాయకులు తెలిపారు. సింహాద్రిపురం మండలం కసనూరులో ఉన్న ఎమ్మెల్సీ బిటెక్ రవీంద్రారెడ్డిని మంగళవారం టిడిపి మండల కన్వీనర్ రామమునిరెడ్డి ఆధ్వర్యంలో కలిశారు. ఈ సందర్భంగా వారు వేంపల్లెలో జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల తీరుపై ఆయన చర్చించినట్లు తెలిపారు. సోమవారం జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికల్లో టిడిపి కోసం పని చేసిన ప్రతి కార్యకర్త, నాయకునికి బిటెక్ రవి కృతజ్ఞతలు తెలిపినట్లు చెప్పారు. అనంతరం పార్టీ కార్యక్రమాలపై చర్చించామన్నారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకుడు పాపిరెడ్డి, మండల మైనార్టీ కన్వీనర్ తెలంగాణ వలి, ప్రధాన కార్యదర్శి మహమ్మద్ ఇనాయతుల్లా, గోగుల మారుతి, మండల ఉపాధ్యక్షుడు వీరభద్ర, డక్కా రమేష్, ఈశ్వరయ్య ఉన్నారు.

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - చాపాడు

విద్యా యజ్ఞం లో భాగంగా మైదు కూరు కస్తూర్బా గాంధీ విద్యాల యంలో 10వ తరగతి, ఇంటర్ చదువుతున్న 96మంది విద్యార్థినులకు పబ్లిక్ పరీక్షలకు సంబం ధించిన పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. కార్యక్ర మంలో శ్రీ గాయత్రి సేవా ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ నిగినే వేంకటేశ్వర్లు , ట్రస్ట్ కార్యదర్శి మధు, ఉప కార్యదర్శి శివానందరెడ్డి, ట్రస్టు సభ్యులు సుబ్బయ్య, పాఠశాల ఆధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి - ఖాజీపేట

ప్రతి విద్యార్థి ఒక నిర్దిష్టమైన లక్ష్యాన్ని ఏర్పరచుకొని కష్టపడి చదివితే జీవితంలో ఉన్నతంగా రాణిస్తారని రైస్ మిలర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి చాపాడు మండలానికి చెందిన మాడూరు వినయ్ కుమార్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల పరిధిలోని సుంకేసుల వద్ద ఉన్న కస్తూరిబా పాఠశాలలో పది, ఇంటర్ విద్యార్థులకు పరీక్ష సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ మేరీ మంజుల, వృక్ష శాస్త్ర అధ్యాపకురాలు ప్రశాంతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు

గత నెల 23న ఇక్కడి ఓ ప్రయి వేట్ ఆసు పత్రిలో అధిక రక్త స్రావంతో మృతి చెందిన స్వర్ణకుమారి కుటుంబికులకు ఎమ్మెల్యే రాచమల్లు ప్రసాదరెడ్డి మంగళవారం ఆర్థికసాయం చేశారు. కొండాపురం మండలం చౌటిపల్లి గ్రామ సచివాలయంలో మహిళా పోలీస్‌గా విధులు నిర్వహిస్తూ ప్రసవానంతరం అధిక రక్తస్రావంతో స్వర్ణకుమారి మృతి చెందిన విషయం తెలిసిందే. జమ్మలమడుగు మండలం వేపరాల గ్రామానికి చెందిన మృతురాలి భర్త కరుమూరి బాబుకు ఎమ్మెల్యే రూ.5లక్షలు అందజేశారు.

జెఎన్‌టియు బి.టెక్ ఫలితాలు విడుదల

- ప్రిన్సిపల్ ఎస్.వసుంధర

ప్రజాశక్తి - పులివెందుల రూరల్

పులివెందుల జెఎన్‌టియు కళాశాలలో ఈ ఏడాది ఫిబ్రవరిలో నిర్వహించిన బి టెక్ రెండవ సంవత్సరం మొదటి సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ (ఆర్-20) పరీక్ష ఫలితాలను మంగళవారం విడుదల చేసినట్లు కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ ఎస్.వసుంధర తెలిపారు. ఈ ఫలితాలను తక్కువ సమయంలోనే విడుదల చేసినందుకు పరీక్ష కేంద్ర విభాగాధిపతులైన ప్రొఫెసర్ కె.త్యాగరాజన్, డాక్టర్ ఎస్.రాధాక్రిష్ణలను ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ అభినం దించారు. పరీక్ష ఫలితాలను కళాశాలల వెబ్‌సైట్‌లో పొందుపరిచామన్నారు. విద్యార్థులు వెబ్‌సైట్‌లో పరీక్ష ఫలితాలు తెలుసుకోవచ్చునని ఆమె వివరించారు.

విజయ రామారావు మృతి బాధాకరం

కడప : మాజీ మంత్రి, సిబిఐ మాజీ డైరెక్టర్ కె. విజయరామారావు మృతి బాధాకరం అని ఎమ్మెల్సీ సి. రామచంద్రయ్య పేర్కొన్నారు. పోలీస్ అధికారిగా, సిబిసిఐ డైరెక్టర్ గా ఆయన చూపిన ప్రతిభ, నెలకొల్పిన ఉన్నత ప్రమాణాలు అనన్య సామాన్యమన్నారు. విజయరామారావు వ్యక్తిత్వం అసాధారణమైందని తెలిపారు.

కెఎల్‌ఎం విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - కడప అర్బన్

రెడ్డి సేవా సమితి 17వ వారికోత్సవం సందర్భంగా నిర్వహించిన వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో కెఎల్‌ఎం మహిళా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థినులు ప్రతిభ చూపారని ప్రిన్సిపల్ డాక్టర్ ఎం.వి.రత్నమ్మ తెలిపారు. మంగళవారం బహుమతులు గెలుచుకున్న విద్యార్థినిలను అభినందించారు. కళాశాలలో సిఎస్ఇ మొదటి సంవత్సరం చదువుతున్న పి.లక్ష్మి భావన వ్యాసరచనలో 3వ బహుమతి సాధించారని పేర్కొన్నారు. ద్వితీయ సంవత్సరానికి చెందిన పి.జ్యోతి, శివాని వ్యాసరచన, వక్తృత్వ పోటీలలో బహుమతులు సాధించారని చెప్పారు. బహుమతులు సాధించిన విద్యార్థినిలకు కందుల గ్రూప్ ఎండి డాక్టర్ కె.చంద్ర ఓబుల్‌రెడ్డి, అన్ని శాఖల బోధన, బోధనేతర సిబ్బంది అభినందించారు. ఉమెన్స్ కళాశాల విద్యార్థినులు వ్యాసరచన, వక్తృత్వ, ఆటల పోటీలలో ప్రతిభ కనబరించారు.

ఎమ్మెల్సీ ఎన్నికలను రద్దు చేయాలి

ప్రజాశక్తి - కడప

అవినీతితో అధికార దుర్వి నియోగంతో ఈనెల 13న జరిగిన పట్టభద్రుల, ఉపాధ్యా యుల ఎమ్మెల్సీ ఎన్నికలను వెంటనే రద్దుచేసి, ఎన్నికలు సజావుగా తిరిగి నిర్వహించాలని పిసిసి డెలిగేట్ బండి జకరయ్య, కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.ఎ. సత్తార్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో అంతులేని అవినీతికి అధికార వైసిపి ప్రభుత్వం పాల్పడిందని వారన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో గతంలో ఏ పార్టీ ఎప్పుడూ చేయని పద్ధతిలో అధికార వైసీపీ ప్రభుత్వం సరికొత్త పద్ధతిలో అవినీతికి తెరదించిందని అన్నారు. వైసిపి ప్రభుత్వం ఒత్తిళ్లతో వాలంటీర్లను లోబరుచుకుని ఓటు అర్హత లేని 6,7,8,9,10 తరగతులు మాత్రమే చదువుకున్న వారిని నమోదు చేయించి వారితో వైసిపి పార్టీ అభ్యర్థులకు ఓట్లు వేయించడం అవినీతికి పరాకాష్ట అన్నారు. సోషల్ మీడియాలో ఈ విషయం వైరల్ అయినా ఎన్నికల కమిషన్ ఎన్నికలను రద్దు చేయకపోవడం అవినీతిలో భాగమే అని వారు పేర్కొన్నారు. రకరకాలుగా ఓటర్లను ప్రలోభాలకు గురి చేయడమే కాకుండా పూర్తిగా అధికార దుర్వినియోగానికి అధికార పార్టీ పాల్పడిందన్నారు. అనర్హులను ఓటర్లుగా నమోదు చేసిన అధికారులను గుర్తించి వెంటనే వారిని సస్పెండ్ చేసి అరెస్టు చేయాలని కాంగ్రెస్ పార్టీగా తాము డిమాండ్ చేస్తున్నట్లు చెప్పారు. అవినీతితో, అధికార దుర్వినియోగంతో జరిగిన ఎమ్మెల్సీ ఎన్నికలను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు.

ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - కడప

కెనరా బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ కోర్సులలో 30 రోజులపాటు, సెల్‌ఫోన్ రిపేరు, సర్వీసింగ్‌లలో 30 రోజులు, సిసి టివి కెమెరా ఇన్‌స్టాలేషన్, సర్వీసింగ్‌లలో 13 రోజుల పాటు ఇచ్చే ఉచిత శిక్షణను గ్రామీణ ప్రాంత నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలని ఆ సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 18-45 సంవత్సరాలలోపు వయసు కలిగిన నిరుద్యోగ యువత ఉచిత శిక్షణ పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. పై తెలిపిన కోర్సులలో ఉచిత శిక్షణ పొందేందుకు ఆసక్తి అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. పూర్తి వివరాలకు 9440905478, 6302833546లలో సంప్రదించాలన్నారు.

అంతర్జాతీయ గణిత దినోత్సవం

కడప అర్బన్: కెఎస్‌ఆర్‌ఎం కళాశాలలో కళాశాల హ్యు మానిటీస్ అండ్ సైన్సెస్ విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ గణిత దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ వి. ఎస్. ఎస్. మూర్తి మాట్లాడుతూ మానవుని దైనందిన జీవితంలో గణితం ప్రాముఖ్యత ఎంతో ఉందన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న గణిత ఔత్సాహికులు అంతర్జాతీయ గణిత దినోత్సవాన్ని ప్రతి ఏడాదీ మార్చి 14న గణిత స్థిరాంకం గుర్తించడానికి నిర్వహించుకుంటారని తెలిపారు. మ్యాథమెటిక్స్ పజిల్స్ పోటీలను నిర్వహించి ప్రథమ, ద్వితీయ స్థానంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రశంసా పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల హ్యూమానిటీస్ అండ్ సైన్సెస్ విభాగాధిపతులు డాక్టర్ శ్రీ వాణి, ప్రోగ్రాం సమన్వయకర్తలు జి.శ్రీధర్, డాక్టర్ వి.రామచంద్ర రెడ్డి, అధ్యాపక సిబ్బంది, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

కేంద్ర పొగాకు పరిశోధన సంస్థతో ఒప్పందం

ప్రజాశక్తి - కడప అర్బన్

పరిశోధనలకు ఊతమిచ్చేలా రాజమండ్రి కేంద్ర పొగాకు పరిశోధనా సంస్థతో యోగి వేమన విశ్వ విద్యాలయం మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. యోగి వేమన విశ్వవిద్యాలయం ఇంక్యుబేషన్ సెంటర్ సంచాలకులు ఆచార్య ఎ. చంద్రశేఖర్, పరిశోధన అభివృద్ధి (ఆర్ అండ్ డి) సంచాలకులు ఆచార్య పి.చంద్ర ఓబుల్‌రెడ్డి సోమవారం రాజమండ్రిలోని కేంద్ర పొగాకు పరిశోధన సంస్థ సంచాలకులు డాక్టర్ మాగంటి శేషు మాధవ్, పరిశోధకులు డాక్టర్ చంద్రశేఖరరావు, డాక్టర్ సరళ, డాక్టర్ సుబ్బయ్య, డాక్టర్ కస్తూరి కలిసి అవగాహన పత్రాలపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా వైవీయూ ఆచార్యులు ఎ చంద్రశేఖర్, ఆచార్య పి.చంద్ర ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ పసుపు, అశ్వగంధ, ఆముదం, మిరప, పొగాకు మొక్కల్లో పరిశోధన నిమిత్తం పరస్పర అంగీకారం జరిగిందన్నారు. శాస్త్ర పరిశోధన ప్రాజెక్ట్ నిధులకు సహకారం అందించడం, పీజీ , పరిశోధక విద్యార్థుల పరిశోధనకు చేయూతను అందిస్తారని తెలిపారు. తమ విశ్వవిద్యాలయం కేంద్ర పొగాకు పరిశోధన సంస్థతో ఎంఒయు కుదుర్చుకోవడం సంతోషంగా ఉందని విసి ఆచార్య జింకా రంగ జనార్దన్, రిజిస్ట్రార్ ఆచార్య వై. పి. వెంకట సుబ్బయ్య, ప్రిన్సిపల్ ఆచార్య కృష్ణా రెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

వైసిపికి తొత్తులుగా పనిచేశారు

కడప అర్బన్ : పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎన్నికల్లో పోలీసులు, రెవెన్యూ అధికారులు దొంగ ఓట్లు నమోదు ప్రక్రియ నుంచి పోలింగ్ వరకు వైసిపికి తొత్తులుగా పనిచేశారని సిపిఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర అన్నారు. మంగళవారం ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రాథమిక దశ నుంచి ఓటర్ నమోదు ప్రక్రియ మొదలుకుని తప్పుడు ధృవీకరణ పత్రాలతో దొంగ ఓట్లు ఎక్కించారని విమర్శించారు. వాటిపై అధికారులకు విన్నవించినా ఫలితం లేదన్నారు. పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్స్ ఉపాధ్యాయ ఎన్నికల ఫలితాల్లో కత్తి నరసింహారెడ్డి, పోతుల నాగరాజు తప్పక గెలుస్తారని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో నాయకులు నాగసుబ్బారెడ్డి, బాదుల్లా, చంద్రశేఖర్, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

క్రైం కార్నర్



పట్టుబడిన ఎర్రచందనం వాహనంతో అటవీ శాఖ నిఘా విభాగం సిబ్బంది

వాహనంతో సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం

ప్రజాశక్తి-పీలేరు

వాహనంతో సహా ఎర్రచందనం దుంగలు స్వాధీనం చేసుకున్నట్లు పీలేరు అటవీ శాఖ సంచార నిఘా విభాగం డిఎఫ్ఒ డిఎ కిరణ్ తెలిపారు. ఎర్రచందనం అక్రమ రవాణా జరుగుతూందని తమకు అందిన సమాచారం మేరకు మంగళవారం ఉదయం రొంపిచర్ల మండలం, బొమ్మయ్యగారిపల్లి పంచాయతీ, జమ్ముకుంట సమీపంలో కాపు కాచి, అటు వైపు వచ్చే వాహనాలు తనిఖీ చేశామన్నారు. అది గుర్తించిన డ్రైవర్ వాహనాన్ని ఆపి పారిపోయాడన్నారు. పట్టుబడిన టయోటా వాహనాన్ని పరిశీలించగా అందులో 141 కేజీల బరువు గల 5 ఎర్రచందనం దుంగలు ఉన్నట్లు గుర్తించామన్నారు. వాహనంతో సహా పట్టుబడిన ఎర్రచందనం దుంగల విలువ రూ.10 లక్షలు ఉంటుందని పేర్కొన్నారు. పారిపోయిన నిందితుల ఆచూకీ కోసం ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు డీఎఫ్ఓ చెప్పారు. ఈ దాడుల్లో ఎఫ్ఆర్ఒ ఎస్.వెంకట్రమణ, ఎఫ్.బి.ఓలు ప్రతాప్, కుప్పుస్వామి, ప్రొటెక్షన్ వాచర్ ప్రభుతేజ, డ్రైవర్ చరణ్ తదితరులు పాల్గొన్నారు.

ఏడుగురు పేకాటరాయుళ్లు అరెస్టు

ప్రజాశక్తి- కలకడ

పేకాటాడుతున్న ఏడుగురు జూదరులను అరెస్టు చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. మండలంలోని దేవులపల్లి పంచాయతీ బొజ్జ గుంటపల్లి సమీపంలో పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందుకున్న ఎస్ఐ తన సిబ్బందితో దాడి నిర్వహించారు. ఈ దాడులలో పేకాట ఆడుతున్న ఏడుగురిని పట్టుకుని వారి వద్ద నుండి రూ.20,090 నగదు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని కోర్టులో హాజరవలసినట్లు తెలిపారు. ఈ దాడులలో సిబ్బంది ఖలీల్, శ్రీనివాసులు లక్ష్మీనారాయణ, హోంగార్డులు సంజీవయ్య, గురవయ్య పాల్గొన్నట్లు తెలిపారు.